క్లుప్తంగా

జలమండలి అధికారుల వివరాలు

హఫీజ్‌పేట్ : హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ శేరిలింగంపల్లి డివిజన్‌లో మంచినీటి, సివరేజ్ సమస్యలు ఉంటే కింద అధికారులకు తెలియజేయవచ్చు

శేరిలింగంపల్లి డివిజన్
జనరల్ మేనేజర్ రాజశేఖర్ : 9989989535

మాదాపూర్ సబ్ డివిజన్ :
పీ.జె. శ్రీనారాయణ (డీజీఎం, మాదాపూర్) : 9989988850
బి. యాదయ్య (మేనేజర్, మాదాపూర్) : 9154297400
నరేందర్‌రెడ్డి (మేనేజర్, గచ్చిబౌలి) : 7331185784
అభిషేక్ (మేనేజర్, నల్లగండ్ల) :9154867438
సందీప్ కుమార్ (మేనేజర్, కొండాపూర్) : 9550731232
విక్రమ్ రెడ్డి (మేనేజర్, డోయన్స్) : 9989989382

చందానగర్ సబ్ డివిజన్ :
టి. నాగప్రియ (డీజీఎం, మియాపూర్) : 9989996001
వి. సాయి చరిత (మేనేజర్, మియాపూర్) : 9154866702
ఎస్‌వీఎస్ సుబ్రమణ్యం రాజు (మేనేజర్, చందానగర్) :9989989045
వై.సునీత (మేనేజర్, దీప్తిశ్రీనగర్) :9154867431
పూర్ణేశ్వరి(మేనేజర్, హఫీజ్‌పేట్) :7331185747

ఆర్సీ పురం సబ్ డివిజన్ :
శివ కృష్ణ (డీజీఎం) : 7337350848
ఎం.జనార్దన్ (మేనేజర్, ఆర్సీ పురం) :9989991590
వి.ప్రవీణ్‌కుమార్ (మేనేజర్, పటాన్‌చెరు) : 8790011977
మంచినీటి ట్యాంకర్ కోసం : 155313

హెచ్‌సీయూలో వార్షిక డిస్‌ప్లే..

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, ఎస్ఎన్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో వార్షిక డిస్‌ప్లే–2023 కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఎమ్ఎఫ్ఏ ప్రోగ్రామ్ అవుట్‌గోయింగ్ బ్యాచ్ విద్యార్థుల ప్రదర్శన ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుంది.

నేడు రూ.2.56 కోట్ల పనులకు శంకుస్థాపన

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. డివిజన్ పరిధిలోని లక్ష్మీవిహార్ కాలనీలో రూ.25 లక్షలతో సీసీరోడ్డు, నానక్‌రాంగూడ ఎస్సీ బస్తీలో రూ.21 లక్షలతో యూజీడీ పనులు, రాయదుర్గంలో రూ.94 లక్షలతో సీసీరోడ్లు, వినాయక్‌నగర్‌లోరూ.11 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. కార్యక్రమంలో ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొంటారు.

నేటి 'సంత

గచ్చిబౌలి: వారాంతపు సంతల నిర్వహణలో భాగంగా శుక్రవారం మధురానగర్‌కాలనీలో సంత నిర్వహిస్తారు. ఉదయం 12 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహించే ఈ సంతలో సరసమైన ధరలకు తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, నిత్యావసరాలు, దుస్తులు, గృహోపకరణాలు, ఇతర వస్తువులు లభిస్తాయి.

బస్‌పాస్ కౌంటర్ పనివేళలు

రాయదుర్గం: ఆర్టీసీ బస్ పాస్ కౌంటర్ సమాచారం

- బస్‌పాస్ కౌంటర్ ప్రాంతం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో లింగంపల్లి బస్టాండులో రెండు బస్‌పాస్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయి.
- నిత్యం ఉదయం 6.30 గంటల నుంచి రాత్రి 8.15 గంటల వరకు అన్ని ప్రభుత్వ పని దినాలలో అందుబాటులో ఉంటాయి.
- విద్యార్థులు, సాధారణ పౌరుల బస్‌పాసులు, రెన్యూవల్స్‌ను ఇక్కడ అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

రోడ్డు పనులు పరిశీలన



సప్తగిరి కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీలో నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం స్థానిక కార్పొరేటర్ రోజాదేవి పరిశీలించారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సంత ..సమస్య

- కాలనీ రోడ్లపై నిర్వహిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు
- చెత్తాచెదారంతో నిండిపోతున్న ప్రధానరోడ్లు
- పరిసరాలు దుర్గంధభూరితం
- ఖాళీ స్థలాల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానికుల వినతి



రోడ్డుపై సంతలో కిక్కిరిసిన జనం, ఇబ్బంది పడుతున్న వాహనదారులు

మియాపూర్: ప్రధాన, అంతర్గత రహదారులపై ఏర్పాటు చేస్తున్న కూరగాయల సంతలతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో గంటల తరబడి వాహనాలు రోడ్లపై నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఎక్కడపడితే అక్కడ రోడ్లపై వాహనాలు నిలిపివేసి కూరగాయల కొనుగోలుకు వెళ్తుండడంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు పార్కింగ్ చేసిన వాహనాలు తీసే వరకు కదలడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

- మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లో రోజు ఏదో ఒక చోట సంత నిర్వహిస్తున్నారు. హుడా కాలనీ, మంజీరా రోడ్డు, చందానగర్‌లోని గోమతినగర్ కాలనీ, పీజేఆర్ ఎన్‌క్లేవ్ రోడ్డు, దీప్తిశ్రీనగర్, జేపీనగర్, డీకే ఎన్‌క్లేవ్, న్యూ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ,శ్రీదేవి థియేటర్ రోడ్లపై ఈ సంతల కారణంగా సమస్యలు ఏర్పడుతున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన మోడల్ మార్కెట్లు, వీధి వ్యాపారుల సముదాయాలను ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి తీసుకురాకపోవంతో వ్యాపారులు రోడ్ల పైనే అమ్ముతున్నారు. ఇక వ్యాపారులు మిగిలిపోయిన కూరగాయలు, ఇతర వ్యర్థాలను రోడ్డు పైనే పారవేస్తుండడంతో ఆ ప్రాంతమంతా చెత్త, చెదారంతో నిండిపోతోంది. వెంటనే తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమలు వృద్ధి చెంది అనారోగ్యం పాలవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.ఈ సంతలను రోడ్లపై కాకుండా కాలనీల్లోని ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



చందానగర్‌లోని మంజీరా రోడ్డులో సంత కారణంగా నిలిచిపోయిన వాహనాలు

క్రైం కార్నర్

జనరేటర్లు చోరీ..

- అమ్మిన ,కొనుగోలు చేసిన ఐదుగురిపై కేసు నమోదు

మియాపూర్ : విద్యుత్ జనరేటర్‌ను దొంగతనం చేసిన ముగ్గురు వ్యక్తులతో పాటు వాటిని కొనుగోలు చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ మహబూబ్(20) స్క్రాప్ షాపులో పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ మతీనుద్దీన్(25) స్క్రాప్ వ్యాపారం చేస్తున్నాడు. మరొకరు మహ్మద్ సోహెబ్(19) స్క్రాప్ రిసీవింగ్ దానిలో పనిచేస్తున్నాడు. వీరు ముగ్గురు స్నేహితులు. వచ్చిన డబ్బులు సరిపోకపోవడంతో జనరేటర్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శేరిలింగంపల్లి నల్లగండ్లలోని సరోజినీ నిలయం అపార్ట్‌మెంట్‌లో 20కేవీఏ మహేంద్ర జనరేటర్‌ను దొంగతనానికి పాల్పడ్డారు. కొన్ని రోజుల క్రిందట గచ్చిబౌలిలో కూడా ఓ మహేంద్ర జనరేటర్ దొంగిలించినట్లు తెలిపారు. మహ్మద్ మహబూబ్, మహ్మద్ మతీనుద్దీన్, సోహెబ్‌లు ముగ్గురు కలిసి ఓ క్రేన్‌ను అద్దెకు తీసుకున్నారు. ఆ తర్వాత ఆన్‌లైన్ యాప్ ద్వారా అశోక్ లేల్యాండ్ ట్రాలీ ఆటోను ఆరువేలకు బుక్ చేసుకున్నారు. శేరిలింగపల్లిలోని నల్లగండ్లలోని సరోజిని నిలయం అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న 20కేవీ జనరేటర్ తమదేనని ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి షిఫ్ట్ చే యాలని, క్రేన్, ఆటో వారికి తెలిపారు. క్రేన్ సహాయంతో జనరేటర్‌ను ఆటోలో పెట్టుకుని తీసుకునివెళ్లిపోయారు. ఈ నెల 8వ తేదీ రాత్రి జనరేటర్ పోయిందని యజమాని శ్రీనివాస్ 10వ తేదీ చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు.దర్యాప్తులో భాగంగా 16వ తేదీ లింగంపల్లి వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా పల్సర్ బైక్‌పై మహబూబ్, మతినుద్దీన్, సోహెబ్‌లు వచ్చారు. వారిని అనుమానించి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా గచ్చిబౌలిలోని ఓ జనరేటర్, సరోజిని నిలయం వద్ద జనరేటర్లు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ జనరేటర్లను సికింద్రాబాద్‌లోని కవాడిగూడకు చెందిన ఎండీ అత్తర్ హుస్సేన్(35), మరో వ్యక్తి కుడితిపూడి శ్రీకాంత్(41)లకు అమ్మేశారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి వారి వద్దనుండి రెండు మహేంద్ర జనరేటర్, ఓ పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అంత్యక్రియలకు బైక్‌పై వెళ్తుండగా ప్రమాదం

ఒకరు మృతి, మరొకరికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: బైక్‌పై సోదరుడి అంత్యక్రియలకు వెళ్తు ముందు వెళ్తున్న వాహనాన్ని ఢీకొని తీవ్రగాయాలైన ఘటనలో ఒకరు మృతిచెందగా, మరో వ్యక్తికి గాయాలైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ జగదీష్ తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్‌లోని మియాపూర్ హెచ్ఎంటి కాలనీకి చెందిన దేవసాయం(35), పోచయ్య ఇరువురు కలసి గురువారం ఉదయం బైక్‌పై మెదక్ జిల్లా టేక్మాల్ మండలం సంపలూరు గ్రామానికి వెళ్తుండగా పటాన్‌చెరు మండలం లక్డారం సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న గుర్తుతెలియని వాహనాన్ని బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో దేవసాయానికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాలైన పోచయ్యకు పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం సేవించిన వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: అతిగా మద్యం సేవించిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన నందు(46) కూలీ పనిచేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఆరు సంవత్సరాల క్రితం భార్య ప్రభావతి తన ఇద్దరు పిల్లలు వినీల్, అక్షయలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో అప్పటి నుంచి ఒంటరిగా ఉంటున్న నందు మద్యానికి బానిసైయ్యాడు. కూతురు వద్ద సాయి కాలనీలో ఉంటున్న తల్లి శోభ కుమారుడిని చూసేందుకు అంబేద్కర్ కాలనీకి వచ్చింది. అక్కడ ఇంట్లో సోఫాపై కూర్చున్న చోటే నందు మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకు మరణంపై తండ్రి ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: కొడుకు మరణంపై అనుమానం ఉందని ఓ తండ్రి ఫిర్యాదు చేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన ఇస్మాయిల్(32)కు 13సంవత్సరాల క్రితం రుద్రారం గ్రామానికి చెందిన ఫాతిమాతో వివాహం జరిగింది. గత కొద్ది రోజులుగా ఇస్మాయిల్ అతని భార్య కుటుంబ కలహాలతో ఇద్దరు దూరంగా ఉంటున్నారు. బుధవారం ఇరువురి కుటుంబ సభ్యులు మాట్లాడి సర్దిచెప్పారు. ఇస్నాపూర్లో అద్దెకు రూమ్ ఇప్పించారు. ఈ క్రమంలో రూమ్‌ను శుభ్రం చేస్తుండగా తాగిన మైకంలో భార్యతో గొడవపడ్డాడు. కాగా సాయంత్రం 7గంటల సమయంలో సడ్డకుడైన ఖాజా మొయినుద్దీన్, ఇస్మాయిల్ ఇద్దరు కలసి రుద్రారంలోని ప్యాలెస్ హోటల్‌కు వెళ్లారు. ఈ విషయాన్ని అతను తండ్రి నహీమ్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. ఇద్దరం రుద్రారం ప్యాలెస్ హోటల్ ఉన్నామని తండ్రితో చెప్పాడు. ఈ క్రమంలో తండ్రి కొడుకును ఇంటికి రమ్మన్నాడు. అతను తన సడ్డకుడు ఖాజామొయినుద్దీన్ వద్ద ఉంటానని చెప్పాడు. అనంతరం ఇరువురు మద్యం సేవించి రుద్రారం వెళ్లారు. ఇస్మాయిల్ ఇంట్లో భోజనం చేసినంతరం వాంతులు చేసుకొని స్పృహ కోల్పోయాడు. దీంతో ఖాజామొయినుద్దీన్, కుటుంబ సభ్యులతో ఇస్మాయిల్‌ను చికిత్స నిమిత్తం ఇస్నాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడినుంచి పటాన్‌చెరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యుల సలహా మేరకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి తండ్రి నహీమ్ కొడుకు మృతిపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

గచ్చిబౌలి: మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజాగూడలోని సహదేవ్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్ మేరి కూతురు(16)ఈ నెల 17న ఉదయం 10 గంటలకు తను పని చేసే అంజ ఎఫ్ స్టూడియోకు వెళుతున్నాని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో పని చేసే చోట, సమీప ప్రాంతాలలో వాకబు చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం తల్లి మేరి రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం 13 మందికి కొవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు.12 మందికి ఆర్టీపీసీఆర్ టెస్టులు చేసినట్లు చెప్పారు.

మేయర్‌కు వినతి

నిజాంపేట్: స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో చెత్తను తరలిస్తున్న కార్మికులు మేయర్‌ను కలిసి తమ ఇబ్బందులను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు ఇంద్రజిత్‌రెడ్డి, ఆగంరాజు ముదిరాజ్, ఆటో, టిప్పర్ యూనియన్ నాయకులు మల్లికార్జున్ , గణేష్, మల్లికార్జున్, మోహన్ తదితరులు ఉన్నారు.

ఏరియా ఆస్పత్రిలో బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో ప్రతి శుక్రవారం మహిళలకు బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ ఉచితంగా చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారి తెలిపారు. కన్సల్టేషన్, స్క్రీనింగ్ సౌకర్యం ఉందని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రాథమిక దశలో బ్రెస్ట్ క్యాన్సర్‌ను గుర్తిస్తే వైద్యం అందిస్తామన్నారు.

ఈతకెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి

పటాన్‌చెరు టౌన్: స్నేహితులతో కలిసి ఈతకెళ్లిన ఇద్దరు చిన్నారులు మృతిచెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం. బిహార్‌కు చెందిన సందీప్ చౌహాన్ బతుకుదెరువు కోసం మూడు సంవత్సరాల క్రితం అమీన్‌పూర్‌లోని హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీలో నివాసం ఉంటూ, సెంట్రింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూడో కుమారుడు యూకేజీ చదువుతున్న సౌరబ్ కుమార్(8), సందీప్ చౌహాన్ మరదలి కుమారుడు ఒకటో తరగతి చదువుతున్న ఆయుష్ కుమార్(9) ఇరువురు స్నేహితులతో పీజేఆర్ ఎన్‌క్లేవ్ సమీపంలోని నీటి గుంతల వద్దకు వెళ్లారు. అయితే ఇద్దరు నీటి గుంతలో దిగి ఈత కొడుతుండగా ప్రమాదవశాత్తు మునిగి మృతిచెందారు. దీంతో వెంట వచ్చిన స్నేహితులు స్థానికులకు సమాచారం ఇచ్చారు. కిరణ్ అనే వ్యక్తి అక్కడికి వచ్చి ఇద్దరు పిల్లలను బయటకు తీసి చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాడు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ఆసుపత్రికి తరలించారు. కుమారుడు, మరదలి కుమారుడు మృతిపై సందీప్ చౌహాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాపు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి

మృతుల్లో పెళ్లికూతురు, మరో మహిళ

పటాన్‌చెరు టౌన్: పెళ్లి బృందంతో వెళ్తున్న డీసీఎం వాహనం ఓ లారీని గత శనివారం ఢీకొట్టిన ఘటనలో డీసీఎంలో ఉన్న మొత్తం 49 మందిలో రాములమ్మ(63), కిష్టమ్మలు ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఐదుగురికి తీవ్రగాయాలైన వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మరో 42 మందికి స్వల్ప గాయాలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గాంధీ ఆసుపత్రిలో కాలు విరిగి చికిత్స పొందుతున్న చిట్కుల్ గ్రామానికి చెందిన నాగమణి (పెళ్లికూతురు) గురువారం చికిత్స పొందుతూ మృతిచెందగా, అదేగ్రామానికి చెందిన గొడిచెర్ల అంతమ్మ(65) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలనీల అభివృద్ధే ధ్యేయంగా సాగుతున్నాం



యూజీడీ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు

- ఎమ్మెల్యే గాంధీ
- ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో యూజీడీ పనులకు శంకుస్థాపన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసినగర్, వాంబే గృహ సముదాయం, ఖాజానగర్, మహంకాళి నగర్, ఇంద్రాహిల్స్ కాలనీల్లో రూ.75.50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ కార్పొరేటర్‌లు నార్నె శ్రీనివాసరావు, దొడ్ల వెంకటేష్ గౌడ్‌లతో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నామని, పలు కాలనీల్లో ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు ప్రతి డివిజన్‌కు ఒక కిలోమీటర్ చొప్పున భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటి ప్రాధానత్యగా ఈ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కాలనీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళుతున్నామన్నారు. తులసినగర్, వాంబే గృహ సముదాయంలో యూజీడీ నిర్మాణ పనులు, ఖాజా నగర్‌లో రూ.14 లక్షలతో, మహంకాళి నగర్, ఇంద్రాహిల్స్ కాలనీలో రూ.42 లక్షల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు డీజీఎం వెంకటేశ్వర్లు, మేనేజర్ యూనిస్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, బీఆర్‌యస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గోవాన్ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

మాదాపూర్: నగరవాసులను గోవాన్ ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంటోంది. మాదాపూర్‌లోని నోవాటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్‌లో గోవా రుచులు అందించడానికి మామ్స్ కిచెన్‌తో కలిసి గోవాన్ ఫుడ్ ఫెస్టివల్‌ను గురువారం ప్రారంభించారు. గోవా చేపల కూర, గోవా ప్రత్యేక వంటకాలు, సాంప్రదాయ రొట్టెలు, మిరియాల మాంసం కూర, మష్రూమ్, పన్నీర్ చిల్లీతో పాటు శాఖాహార వంటకాలను అందుబాటులో ఉంచారు. ఈ ఫెస్టివల్ ఈనెల 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు



తెలిపారు. కార్యక్రమంలో నోవాటెల్ హోటల్ జనరల్ మేనేజర్ రూబిన్ చెరియాన్, మామ్స్ కిచెన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- ముగిసిన సీఎం కప్ క్రీడలు

పటాన్‌చెరు టౌన్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం మైత్రి మైదానంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యేతో పాటు ప్రజాప్రతినిధులు హాజరై విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. జిల్లా స్థాయి పోటీలో పాల్గొనే క్రీడాకారులకు సొంత నిధులతో ట్రాక్స్ అందజేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం , జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, కార్పొరేటర్ కుమార్‌యాదవ్, అమీన్‌పూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

విరాళం అందజేత

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూడ హరివిల్లు కాలనీలో నిర్మిస్తున్న అయ్యప్పస్వామి దేవాలయం, బీఎస్ఆర్ కాలనీలో నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయాల నిర్మాణాలకు రూ.5లక్షల చొప్పున రూ.10 లక్షలను విరాళంగా బుధవారం పటేల్‌గూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. దేవాలయాల నిర్మాణానికి విరాళం అందించడంపై కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, సర్పంచులు నితీషా శ్రీకాంత్, భాస్కర్‌గౌడ్, కృష్ణ, పాండు, సీనియర్ నాయకులు రాజు, మల్లేష్, జ్ఞానేశ్వర్, శ్రీకాంత్‌రెడ్డి, గోవిందు, కాలనీవాసులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ఉచిత ఆరోగ్య కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ల లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రం ఉంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. అవుట్ పేషంట్‌కు రూ.30లు చెల్లించాలి. ప్రతి రోజు సుమారు 25 మంది రోగులకు వైద్య పరీక్షలు అందిస్తారు. వైద్య పరీక్షలు చేసిన వారికి ఉచితంగా మందులు, మైనర్ ఆపరేషన్లు కూడా నిర్వహిస్తారు. జనరల్ ఫిజిషియన్, గైనకాలజీ డాక్టర్లు ఉంటారు. కేంద్రానికి సికింద్రాబాద్, మసీద్‌బండ, కొండాపూర్, మార్తాండనగర్, సుభాష్‌చంద్ర బోస్ నగర్, ప్రేమ్‌నగర్ తదితర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. ఆదివారం ఆరోగ్య కేంద్రానికి సెలవు.

'ఏసీఎస్'లో హెచ్‌సీయూ పరిశోధనా పత్రం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ పరిశోధనా పత్రం అమెరికన్ జర్నల్‌లో ప్రచురితమైంది. అమెరికన్ కెమికల్ సొసైటీ (ఏసీఎస్) ప్రచురించిన మాలిక్యులర్ ఫార్మాస్యూటిక్స్ జర్నల్‌లో హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ అశ్వినికుమార్ నాంగియా, అతని పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ అసోసియేట్లు చైతన్య మన్నవ, అభిజిత్ రాయ్‌ల ఆధ్వర్యంలో ఔషధ కో క్రిస్టల్స్, లవణాలుగా తక్కువ ద్రావణీయత, తక్కువ ప్రాధాన్యత కలిగిన మందులలో ఔషధ ప్రక్రియను పెంపొందించడానికి కొత్త విధానాలను రూపొందించారు.

హెబ్బా సందడి



సాక్షి, సిటీబ్యూరో: యువ నటి హెబ్బా పటేల్ శరత్ సిటీ మాల్‌లో సందడి చేశారు. మెట్రో బ్రాండ్స్ లిమిటెడ్ కు చెందిన రోజువారీ ఫాస్ట్ ఫ్యాషన్ ఫుట్‌వేర్ బ్రాండ్ వాక్‌వే ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె అభిమానులకు ఆటోగ్రాఫ్‌లిస్తూ సందడి చేశారు. ప్రస్తుతం తమిళం, తెలుగు, కన్నడ...సినిమాలు, వెబ్‌సిరీస్‌లలో నటిస్తున్నానని ఆమె ఈ సందర్భంగా చెప్పారు.